

ఉత్తమ పంచాయతీల గుర్తింపు

గంగిరెడ్డిపల్లి, వివి కండ్రిగ ఎంపిక

ప్రజాశక్తి - కడపప్రతినిధి

రాష్ట్రంలో ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పిన పంచాయతీలకు గుర్తింపు లభించింది. రాష్ట్రప్రభుత్వం ఉత్తమ జీవన ప్రమాణాలు, ఆరోగ్య పంచాయతీలు, ఫ్రెండ్లీ పంచాయతీలు, నీటి సరఫరా, క్లీన్అండ్ గ్రీన్, స్వయం సమృద్ధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీలు, సామాజిక సంక్షే మం, గుడ్‌గవర్నెన్స్, మహిళల స్నేహితత్వం వంటి తొమ్మిది ప్రమా ణాలతో కూడిన కేటగిరీల కింద ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలను ఎంపిక చేసింది. ఇందులో కడప జిల్లా కమలాపురం నియో జకవర్గం వీరపునాయునిపల్లి మండలంలోని గంగిరెడ్డిపల్లి పంచా యతీ ఉత్తమ జీవన ప్రమాణాలు కలిగిన పంచాయతీగా గుర్తింపు లభించింది. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం వివి కండ్రిగ పంచాయతీలో తాగునీటి నిల్వలు పుష్కలంగా కలిగిన కేటగిరీ కింద ఎంపికైంది.

యువతను సన్మార్గంలో నడిపించడమే

నెహ్రూ యువకేంద్రం లక్ష్యం

జిల్లా అధికారి కొరాడ మణికంఠ



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప అర్బన్

యువతను సన్మార్గంలో నడిపించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి ఆటల్లో, సేవల్లో, చదువులో, వ్యక్తిత్వ వికాసంలో, దేశ నిర్మాణంలో భాగస్వాములు చేయడమే నెహ్రూ యువకేంద్ర లక్ష్యం...అని జిల్లా అధికారి కొరాడ మణికంఠ అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో యువత కోసం జిల్లాలో చేపడుతున్న, చేపట్టనున్న కార్యక్రమాలపై వివరించారు.

నెహ్రు యువ కేంద్ర లక్ష్యం ఏమిటి?

యువతను సన్మార్గంలో పయనింపజేయడం, వారి భవిష్యత్‌కు బంగారు వేయడమే లక్ష్యం. 1972లో యువకేంద్రాన్ని స్థాపించాం. అప్పటి నుంచి యువత సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. యువత అంటే సాధారణంగా 15-29 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ఉంటారు. కొందరు చదువుకుని, మరికొందరు చదువు కోలేని వారూ ఉంటారు. ఇలాంటి వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తుంటాం. యువతలో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందేలా వైద్య విద్యాధికారి గుణశేఖర్ ద్వారా శిక్షణ ఇప్పించాం. 2019, అక్టోబర్ 5న నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించాను. అప్పటి నుంచి అనేక కార్యక్రమంలో యువత కోసం చేస్తూనే ఉన్నాం. వివేకానంద జయంతి రోజు యువజ నోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నాం. యువత సర్వతోముఖాభివద్ధే నెహ్రూ యువ కేంద్ర లక్ష్యం.

యువతకు ఎలాంటి శిక్షణలు ఇస్తుంటారు?

విద్యను అభ్యసిస్తున్న వారి కోసం పాఠశాలలో, కళాశాలలో ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ ఉంటుంది. విద్య పూర్తి అయిన వారి కోసం ఎలాంటి శిక్షణలు ఉండవు. ఇటువంటి వారి కోసమే యువ కేంద్రం వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం. విద్య పూర్తయిన తరువాత ఎవరైతే ఖాళీగా ఉంటారో వారిని యువజన సంఘాలు స్థాపించేలా ప్రోత్సహిస్తాం. సంఘాల చుట్టూ ఉన్నా గ్రామాలలో సేవ చేస్తూ దేశ పురోగతిలో భాగస్వాములు చేస్తాం. విద్య పూర్తయిన తరువాత యువత తమ కాళ్లపై తాము నిలబడి ఉపాధి పొందేలా చేయడమే యూత్ వింగ్ లక్ష్యం.

యువత నైపుణ్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేస్తున్నారు?

యువత నైపుణ్యాభివృద్ధికి నెహ్రూ యువకేంద్ర, స్టెప్, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, దీన్‌దయాల్ ఉపాధ్యా గ్రామీణ కౌశల్ యోజన ఉన్నాయి. నూతన విద్యా విధానంలో భాగంగా భవిష్యత్తులో ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలు ఉండవు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ విద్యార్థులకు అందిస్తారు. చదువుతో పాటు .టెక్నికల్ శిక్షణ పూర్తవుతుంది. దీంతో యువత స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ ఉంటుంది.

జాతీయ సేవా కార్యకర్తలకు ఎలాంటి ప్రోత్సహకాలు ఇస్తున్నారు?

జాతీయ స్థాయిలో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై దేశానికి మేలు చేసే కార్యకర్తలను గుర్తించి సేవా అవార్డులు ప్రదానం చేస్తారు. స్వచ్ఛ భారత్, పౌష్టిక ఆహార అవగాహన సదస్సులు, క్రీడల్లో ప్రోత్సహం ఇలా అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన వారికి ప్రోత్సహక అవార్డులు అందిస్తారు. కొద్ది సంవత్సరాల కిందట అనంతపురానికి చెందిన సేవా కార్యకర్త రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. యువతను రక్తదానం చేయించడం, గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం, మహిళలకు ముగ్గుల పోటీలు, కుట్టుమిషన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాం.

జిల్లాలో ఎన్ని సంఘాలు ఉన్నాయి?

మన జిల్లాలో 250కిపైగా యువజన సంఘాలు, సొసైటీలున్నాయి. వీరు చేసే సేవా కార్యక్రమాలు బాగా ఉంటే అవార్డులు అందిస్తున్నాం. యువతలో నాయకత్వ లక్షణాల పెంపునకు నేషనల్ యూత్ పార్లమెంట్, ఉపన్యాసల పోటీలు, డ్రాయింగ్, పోయం,మొబైల్ ఫొటోగ్రఫీ పోటీలు, గ్రూప్ చర్యలు నిర్వహించి యువతలోని నైపుణ్యాన్ని వెలికితీస్తున్నాం. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి పార్లమెంట్ నుంచి నగదు బహుమతులు ఇస్తారు.


ఇప్పటి వరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు?

గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించాం. జిల్లా స్థాయికి తీసుకువచ్చాం. వక్తృపోటీలలో గెలుపొందిన వారిని ఆల్ ఇండియా రేడియోకు తీసుకువెళ్లి యూత్ డే రోజు మాట్లాడించాం. యువ వాణి కార్యక్రమంలో మాట్లాడారు. వివేకానంద డిగ్రీ కళాశాలలో కేరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించాం. డిగ్రీ పూర్తయిన వారికి ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తుంది, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి గైడెన్స్ ఇచ్చాం. నాయకత్వ లక్ష అభివృద్ధికి మూడు రోజులు శిక్షణ నిర్వహిచాం.

సిట్టింగులకూ సర్వేల సెగ!

కమలాపురంలో నలుగురిపై సర్వే

ఎమ్మెల్యేపై వ్యతిరేకతే కారణమా



వైసిపి ఎమ్మెల్యేలకు సర్వేల సెగ తలుగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లడంలో భాగంగా ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సర్వేలపై ఆధారపడి ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా అధికార వైసిపి నాయకత్వం సిట్టింగ్ ఎమ్మెల్యేలపై సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. ఇందులోభాగంగా కమలాపురంలో నలుగురు నాయకులకు ప్రజల ఉన్న ఆదరణను పసిగట్టే ప్రయత్నం చేస్తోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని మిగిలిన తొమ్మిది మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లోనూ గుబులు రేగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ మేన మామ నియోజకవర్గంపైనే సర్వే చేస్తున్న నేపథ్యంలో తమపై కూడా సర్వే చేసే అవకాశం ఉంటుందనే అంచనాకు పలువురు ఎమ్మెల్యేలు వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సర్వే శకం నడుస్తోంది. 2024లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధికార వైసిపి సామాన్యులకు అందించిన సంక్షేమాన్ని నమ్ముకోవడంతోపాటు, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో వ్యతిరేకత కనిపించిన ప్రాంతాల్లో సర్వేలు చేయిస్తున్నట్లు సమాచారం. ప్రతిపక్ష టిడిపి సైతం సర్వేలపై ఆధారపడిన నేపథ్యంలో సర్వేలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇందులోభాగంగా రాష్ట్రప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం, మా భవి ష్యత్ నువ్వేజగన్ వంటి కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. సంక్షేమ సదుపాయాలను వివరిస్తూ ప్రజలతో మమేకం కావడానికి సర్వ ప్రయత్నా లు చేస్తుండడం గమనార్హం.

కమలాపురంలో నిరసనల జోరు

గడపగడపకూ మనప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా ఏడాది కిందటి నుంచి కమలాపురం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లి, పెండ్లిమర్రి, కమలాపురం మండలాల్లోని దేవరాజుపల్లి వంటి గ్రామాల్లో నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి. దీనికితోడు నియోజకవర్గ పరిధిలోని కాంట్రాక్టు పనులన్నింటినీ చాలావరకు ఎమ్మెల్యే కుటుంబమే చేసుకుంటోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ముఖ్యమంత్రి కమలాపురం పర్యటన సందర్భంగా ప్రజలను సమీకరించే ప్రయత్నంలో కార్యకర్తల దగ్గర నుంచి ద్వితీయశ్రేణి కేడర్ వరకు అసంతృప్తులు, గుసగుసలు వినిపించడం తెలిసిందే. దీనికితోడు ఇటీవల వీరపునాయునిపల్లి మండలంలో పలువురు నాయకులు సమావేశం నిర్వహించడం, అధికార వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు మొదలుకావడం వంటి ఘటనల నేపథ్యంలో సర్వే తెర మీదకు రావడం చర్చనీయాంశంగా మారింది.

నలుగురు నేతలపై సర్వే

2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా రాజకీయ పార్టీలన్నీ సర్వేల ఆధారపడి ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో అధికార వైసిపి అధినాయకత్వం కమలాపురం నియోజకవర్గ పరిధిలోని నలుగురు నేతలకు ప్రజల్లో ఉన్న ఆదరణ పట్ల సర్వే చేయడానికి మొగ్గు చూపినట్లు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి, ఆయన కుమారుడు నరేన్ రామాంజులరెడ్డి, ఆర్‌టిసి ౘైర్మన్ మల్లికార్జునరెడ్డి, రాజోలి పారిశ్రామిక వేత్త రాజోలి వీరారెడ్డిపై సర్వేలు జరుగుతున్నట్లు తెలిసింది. వైసిపి నాయకత్వం ఏడాదిన్నర కిందటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా చూసుకునేందుకు ఉద్దేశించి గడపగడపకూ మనప్రభుత్వం, మా భవిష్యత్ నువ్వే జగన్ పేర్లతో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. ప్రజలతో ఇంతగా మమేకమైపోతున్నప్పటికీ ఎమ్మెల్యేల పట్ల వ్యతిరేకత పెరగడానికి కారణాలేమిటనే తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

సిట్టింగ్‌లకూ తప్పని గుబులు

2019సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను వైసిపి క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. జిల్లాల విభజన నేపథ్యంలో అధికార వైసిపి పరిస్థితి ఏమిటనే కోణంలో సర్వేలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా కమలా పురంపై సర్వే చేయించినట్లు సమాచారం. రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ తన మేనమామ నియోజ కవర్గంపైనే సర్వేకు ఆదేశించిన నేపథ్యంలో మిగిలిన సిట్టింగ్ ఎమ్మెల్యేలపై సర్వే చేయించే అవకాశం ఉందనే భావన వ్యక్తమవుతోంది.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బద్వేలు

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేంద్రబాబు సంయుక్తంగా పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో పి.సి. కొండయ్య అధ్యక్షతన సిఐటియు పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ కార్మిక, రైతు అనుకూల విధానాలను అమలు చేయాలన్నారు. రైతు పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నిత్యావసర సరుకులు ధరలను అదుపులో ఉంచాలని పేర్కొన్నారు. ఉపాధి పనులను 200 రోజులు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మొండి చెయ్యి చూపారని వాపోయారు. ప్రత్యేక సాధన కోసం అధికార, ప్రతిపక్ష ప్రధాన పార్టీలు కేంద్రంతో పోరాడాలని సూచించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని, పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం 137వ మే డే సందర్భంగా నిర్వహించే సిఐటియు పతాకావిష్కరణ, ప్రదర్శన, సభలలో సంఘటిత అసంఘటితరంగా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పులిశ్యాం ప్రవీణ్, ఇరుపోతు ఓబులేసు, పట్టణ నాయకులు ఇరగదిండ్ల రమణయ్య, గొడుగునూరు రాజగోపాల్, గంగనపల్లె నాగార్జున, ముడియం నరసింహులు బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ నాయకులు దియ్యాల నాగేంద్రబాబు, దియ్యాల హరి,గంటా శ్రీనివాసులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మూడు బుల్లెట్ వాహనాలు సీజ్

కడప అర్బన్ : నగరంలో అధిక శబ్దంతో వాహనాలు నడుపుతున్న మూడు బులెట్ వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహన చట్టం కింద జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సిఐ సీతారామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో వాహనాలను ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి అన్బురాజన్ అదేశాల మేరకు ఎప్పటికప్పుడూ ఇలాంటి వాహనాల తనిఖీలను నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బులెట్ బైక్‌కు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్‌నే వినియోగించాలని పేర్కొన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జ్ఞాన సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్టాపన

పోరుమామిళ్ల : మండలంలోని రామాయపల్లె ప్రాథమిక పాఠశాలలో జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్ హాజరయ్యారు. మొదట జ్ఞాన సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో జ్ఞాన సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయంగా ఉందన్నారు. పాఠశాలలో విగ్రహం ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తుపాకుల శ్రీనివాసులు ,శ్రీశైలం దేవస్థానం మాజీ బోర్డు మెంబర్ సీత వెంకట సుబ్బయ్య , గ్రామస్తులు పాల్గొన్నారు

పుస్తకాల పాత్ర కీలకం

కడప అర్బన్ : మనిషి జీవితంలో పుస్తకాల పాత్ర కీలకమని వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఈశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్.అమీరుద్దిన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పుస్తకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. పుస్తకాలు లేకపోతే నేటి ఆధునిక ప్రపంచం పురోగతి లేదని, జ్ఞాన సముపార్జనకు ఎంతో దోహపడుతుందని పేర్కొన్నారు. మెరుగైన జీవితానికి ఉపయోగపడతాయని తెలిపారు. పుస్తక పఠనం పిల్లలకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. చదువు సంపూర్ణంగా ఉండాలంటే పుస్తకపఠనం ఎంతో ముఖ్యం అన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కడప అర్బన్ : ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం కార్యదర్శి ఆర్. పావనమూర్తి ఆదివారం చిన్నచౌకు గురుకులంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2023 -24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదవ తరగతి పరీక్షకి 55485 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 46,024 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 186 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.



క్యూలో నిల్చున్న భక్తులు, పూలంగి అలంకరణలో చెన్నకేశవుడు (ఇన్‌సెట్‌లో)

పుష్పగిరికి పోటెత్తిన భక్తజనం

-పూలంగి సేవలో చెన్నకేశవుడు

ప్రజాశక్తి - వల్లూరు

పవిత్ర పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరొందిన వల్లూరు మండలంలోని పుష్పగిరిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి దర్శనం ఇచ్చారు. వేకదాము నుంచి వేద పండితులు చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించారు. శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పెద్ద ఎత్తున స్వామివారిని దర్శనం చేసుకున్నారు. గరుడ వాహనంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి నంది వాహనంపై శ్రీ కామాక్షి వైద్య నాదేశ్వర స్వామిని అలంకరించారు.

నేటి విద్యార్థులే రేపటి సమాజనిర్దేశకులు

ప్రజాశక్తి - బద్వేలు

నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్దేశకులని జిల్లా సమగ్ర ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దీప్తి నవోదయ, సైనిక్ స్కూల్ కోచింగ్ వార్షికోత్సశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నూతన పోకడలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, తద్వారా విద్యార్థి పోటీ పరీక్షలను ఎదుర్కోనేలా చదువులు ఉండాలని తెలియజేశారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల ఆశయ సాధనలో తామున్నవంటూ ప్రతి ఏడాది అధిక సీట్లు సాధిస్తున్న దీప్తి నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా వారు అభినందించారు. ప్రతి విద్యార్థీ సమాజానికి ఉపయోగపడాలని, ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి ఎన్ చెన్నయ్య , మహేశ్వర్ రెడ్డి స్కూల్ కరస్పాండెంట్ మహేశ్వర్ రెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు చింతమరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా సీట్లు సాధించిన 15 మంది విద్యార్థులకు మెమోటోలు అందజేశారు. కార్యక్రమంలో జమాల్, ప్రవీణ్, కుమార్, నరసింహారెడ్డి, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకం ప్రకారం దాడి

ప్రజాశక్తి - కడప అర్బన్

పథకం ప్రకారం ఎర్రగొండపాలెంలో చంద్రబాబు నాయుడు పై దాడి చేశారని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటనపై సిబిఐ, ఎన్‌ఐఎతో విచారించాలని డిమాండ్ చేశారు. రాళ్లదాడిని తీవ్రంగా ఖండిస్తున్నమని చెప్పారు. ఆదిమూలపు సురేష్ ఐఆర్‌ఎస్ చదువుకున్న వ్యక్తి, కేబినేట్ హోదాలో ఉండి చిల్లర రౌడీ లాగా చొక్కా విప్పి రోడ్డు మీదికి రావడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, 47 డివిజన్ ఇన్‌ఛార్జి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా సుబ్బయ్య

చేతి వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య

ప్రజాశక్తి- కడప అర్బన్


చేతి వృత్తిదారుల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య విమర్శించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. పొంగూరు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వృత్తులపై సుమారు కోటి 70 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వీరి సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం1 5 మంది సభ్యులతో వృత్తి కోపరేటివ్ సొసైటీలు, 12 రకాల వృత్తులు బిసి కార్పొరేషన్, వివిధ ఫెడరేషన్ల ద్వారా అనుబంధంగా రుణాల కోసం ఎదురుచూస్తున్న వృత్తి సొసైటీలు, వేలాది సొసైటీలను ఒక్క కలం పోటుతో రద్దుచేసిందని తెలిపారు. 56 కార్పొరేషన్ల ద్వారా 139 కులాల వృత్తులను, బీసీలను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు బూటకమని వాపోయారు. బిసి సబ్ ప్లాన్ పేరుతో గత గడిచిన రెండు బడ్జెట్లలో రూ.35 వేల కోట్లు బిసిలు, వృత్తిదారులకు ఏమాత్రం ఉపయోగపడలేదని చెప్పారు. ఇప్పుడు బడ్జెట్‌లో రూ.38,206 కోట్లు కేటాయించామని కల్లబొల్లి మాటలు చెబుతూ ఇబిసి సబ్ ప్లాన్ కి చట్టబద్ధత కల్పించకుండా బిసి వృత్తిదారులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సమగ్ర కుల గనను ప్రకటించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని వాపోయారు. వృత్తిదారులను విస్మరించిన ప్రభుత్వానికి రానున్న రోజుల్లో వృత్తిదారులందర్నీ ఐక్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వృత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ వృత్తుల సమస్యల పైన జిల్లాలో అనేక గ్రామ, పట్టణాలలో ప్రజలను చైతన్యపరిచి సమన్వయ సదస్సులు, సభలు నిర్వహించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం పద్మ, శివ సుబ్బారావు, సుబ్బరాయుడు, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం లక్ష్మయ్య, చేనేత కార్మిక సంఘం వెంకటకృష్ణ, వడ్డెర వృత్తిదారుల సంఘం వేముల విక్రం, గంప సుబ్బరాయుడు, నాయి బ్రాహ్మణ వృత్తిదారుల సంఘం, గొల్లి సూరిబాబు, పిచ్చిగుంట్ల కథ సంఘం సేలం రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం చెప్పలి సుబ్బయ్య, పాల్గొన్నారు. పొద్దుటూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు పట్టణాల్లో సదస్సులు వృత్తిదారుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య

వికలాంగుల రాష్ట్ర అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి కడప అర్బన్



చిన్న సుబ్బయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న సంఘాల సభ్యులు

వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్‌ను ఎంఆర్‌పిఎస్, ఎంఎస ఎఫ్, ఎంఇఎఫ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి అనుభంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వికలాంగుల పింఛను రూ.6000 పెంచాలని, తొలగించిన 95 వేల ఫించన్లను వెంటనే పునరుద్ధరించాలి డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ టాప్ టెన్‌లో పెట్టాలన్నారు. బ్యాక్‌లాక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లాలో కన్వీనర్ శివయ్య మాదిగ, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు మాతయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులుపూసపాటి. రెడ్డయ్య, ఎం పిచ్చికి. బాబు, ఎంఆర్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ వెంకటేష్ మాదిగ, వికలాంగుల నగర అధ్యక్షుడు ప్రసాద్, నగర ప్రధాన కార్యదర్శి నాగయ్య, కార్యదర్శి అరిపుల్లా, ఓబయ్య, అంజి, లలిత, ప్రేమలత, సులోచన పాల్గొన్నారు.

ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్



ఆర్‌జెడికి స్వాగతం పలుకుతున్న జోగిరామిరెడ్డి

రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గా తిరిగి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంకట కృష్ణారెడ్డి ని కృష్మా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి కలిసి ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జెడిగా వెంకట కృష్ణారెడ్డిని కొందరి రాజకీయ అవసరాల కోసం అర్ధాంతరంగా బదిలీ చేయడం దారుణమని పేర్కొన్నారు. డిపార్ట్మెంట్‌కు ఆయన చేసిన సేవలు గుర్తించి ప్రభుత్వం పునః నియమించడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. ఆయన నియామకాన్ని కృష్మా స్వాగతిస్తుందని చెప్పారు.



తలపడుతున్న నెల్లూరు -కర్నూలు జట్లు

టి-20లో కడప జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్స్ టి-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టు 23 పరుగుల తేడాతో చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన చిత్తూరు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణిత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఆ జట్టులోని షేక్ జహీర్ అబ్బాస్ బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 40 బంతులను ఎదుర్కొని 6 బౌండరీలు, 8 బౌండరీ సిక్సుల సహాయంతో 93 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ జి.వి. పవన్ కుమార్ రెడ్డి 30 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టు లోని ఆర్. మాధవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 197 పరుగుల విజయలక్ష్మితో బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టు లోని కెవెన్ పృద్వి రాజ్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించాడు. 61 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 4 బౌండరీ సిక్సుల సహాయంతో 101 పరుగులు చేశాడు. ఇ. ధరణి కుమార్ 26 పరుగులు చేశాడు. కడప జట్టులోని కె. సుదర్శన్ 2 వికెట్లు తీసుకున్నాడు. **కర్నూలుపై విజయం సాధించిన నెల్లూరు జట్టు** .. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో కర్నూలు జట్టుపై 4 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం.కే. రెడ్డి 64 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు లోని వై. సుదర్శన్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 149 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసి ఓటమి చెందింది. .

పుష్పగిరిలో అన్నదానం

చెన్నూరు : పుష్పగిరి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ వైద్యనాధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కొప్పుల ఓబులేష్, చీర్ల చెన్నయ్య, ప్రతాప్ యాదవ్, విజయ్ కుమార్ యాదవ్, మూర్తి యాదవ్, రామచంద్రుడు, ప్రతాప్ యాదవ్, గంగాదేవి గంగయ్య ఇంకా అనేకమంది యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పర్యాటకుల రద్దీ సమయంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య

గండికోటలో ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో?

- శని, ఆదివారాల్లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఒక వైపు ఆనందం.. మరోవైపు ట్రాఫిక్ సమస్యతో నిరీక్షణ.. ఈ నిరీక్షణకు స్వస్తి పలికేదెన్నడో అని గండికోట పర్యాటకులు ఎదురుచూస్తున్నారు. శని, ఆది వారాలు, పండుగ, సెలవు రోజుల్లో గండికోట టూరిజానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. శని, ఆదివారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు గండికోట పర్యాటకులతో కిక్కిరిసి ఉంటుంది. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప జిల్లాలోని చుట్టుపక్కల ప్రదేశాల నుంచి, కర్ణాటక, హైదరాబాద్, బెంగళూరు, హోస్పేట ప్రాంతాల నుంచే కాక రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. బైక్, కారుల్లో వచ్చి ఇక్కడి ప్రదేశాలను ఆస్వాదించి ఆనందంతో వెళుతుంటారు. ఈ నేపథ్యంలో వారి ఆనందానికి, సంతోషానికి ట్రాఫిక్, కనీస సదుపాయాల కల్పనలో కొంత అసౌకర్యం ఏర్పడుతోంది. పార్కింగ్ ప్లేస్ లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కోట లోపల చూడదగిన ప్రదేశాలు జుమ్మా మసీదు, కత్తుల కోనేరు, ధాన్యాగారం, పెన్నా లోయ, మాధవరాయ టెంపుల్ చూడాలంటే కోట బయట రోడ్డు మీదనే వాహనాలు నిలిపి లోనికి వెళ్లాలి. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అక్కడ తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో గండికోటలో అభివృద్ధికి, కనీస వసతుల కల్పన కోసం గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఆచరణలో మాత్రం వెనుక బాటుతనం కనబడుతోంది. స్థానికులు కూడా నిరుత్సాహంతో ఉన్నారు.

ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి



గండికోట పర్యాటక ప్రదేశం కావడంతో రోజురోజుకూ పర్యాటకుల తాకిడి ఎక్కువ. అందుకు తగ్గట్టు సరైన వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. గండికోట లోపల రోడ్డు కానీ, ఇతర కనీస వసతులు కల్పించడానికి మండల పరిషత్ ద్వారా చేసేందుకు వీలులేదు. కావున పర్యాటక అధికారులు చొరవ తీసుకుని వెంటనే అన్నిరకాల వసతులు కల్పించాలి. ప్రభుత్వం కూడా కమిటీ ద్వారా త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. - కె.గురుఈశ్వర్, సర్పంచు, గండికోట

వీధి రౌడీలా ప్రవర్తించడం సిగ్గుచేటు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ రోడ్డు మీద చొక్కా విప్పి వీధి రౌడీలా ప్రవర్తించడం సిగ్గుచేటని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రగొండు పాలెంలో టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి దాడులు గర్హనీయమన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వమే ఆ సమస్యలను సృష్టించడం దురదృష్టకరమన్నారు. మంత్రి ఆది మూలపు సురేష్‌ను ముఖ్య మంత్రి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు మార్గాన కాకుండా వీర జవాన్లను వాయు మార్గాన తరలించేందుకు విమానాలు సమ కూర్చి ఉంటే 2019లో పుల్వామా దుర్ఘటనలో 40 మంది జవాన్లు చనిపోయి ఉండేవారు కాదని చెప్పినందుకు నాటి గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై మోడీ ప్రభుత్వం కక్ష సాధించడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం జవాన్ల ప్రాణాలను బలి పెట్టడం దుర్మార్గం అన్నారు. ప్రధాన మంత్రి పదవిని త్యాగం చేసిన రాహుల్ గాంధీకి ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయడం ఒక లెక్క కాదన్నారు. దేశంలో ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడిందని తెలిపారు. బిజెపి కక్ష సాధింపు చర్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని విమర్శించారు. బిజెపి సెల్ఫ్‌గోల్ కొట్టుకుంటోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

విద్యుత్ లైన్లపై మంటలు

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రంలో పట్టపగలే విద్యుత్ స్తంభాలపై మంటలు చెలరేగుతున్నాయి. కొండాపురం పట్టణంలో విద్యుత్ అధికారులు బిల్లుల మాత్రం వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు తప్ప, నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, స్తంభాల సమస్యలు ఎక్కువవుతున్నాయి. పట్టణంలో విద్యుత్ లోడు అధికంగా ఉన్నప్పటికీ వాటికి తగ్గట్టు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటు చేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఏ సమయంలో ఎక్కడ విద్యుత్ వైర్లు తెగిపడుతాయోనని ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం విద్యుత్‌శాఖ ఫీజ్ ఆఫ్ కాల్ సమీపంలో లోడ్ అధికంగా రావడంతో విద్యుత్ స్తంభాలపై మంటలు చెలరేగాయి. వాటిని చూసి చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలో లోడుకు తగ్గట్టుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



లక్షలు వెచ్చించారు.. వినియోగం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు ప్రయోజనం చేకూరడం లేదు. ప్రజల దాహార్తి తీర్చడం కోసం గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున శుద్ధి నీటి కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రజలకు సురక్షిత జలాలను అందించాలనే లక్ష్యంతో తక్కువ ధరకే శుద్ధి నీటిని అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పత్తూరు, తవ్వారెల్లె, ఖాజీపేట తదితర గ్రామాల్లో ఎంపీ గ్రాంట్ నిధులతో దాదాపు నాలుగు లక్షల ఇరవై రూపాయల విలువైన శుద్ధి నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో బాగా ఆదరణ ఉండేది. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వహణ లోపం కారణంగా అవి మూతపడ్డాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత జలాలు అందడం లేదు. ప్రైవేట్ శుద్ధినీటి కేంద్రాలకు వెళ్లి మంచినీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నిరుపయోగంగా ఉన్న శుద్ధినీటి కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి సురక్షిత జలాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



పత్తూరులో పనిచేయని శుద్ధి నీటి కేంద్రం

అప్రమత్తతతే ప్రధానం

'101' కి ప్రమాద సమాచారమివ్వాలి : జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతే ప్రధానమని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ప్రొద్దుటూరు అగ్నిమాపక కేంద్రంలో 25 మంది సిబ్బంది, ఒక హోంగార్డు ఉన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే 101కి ఫోన్ చేయాలని ఆయన ప్రజలకు సూచిస్తున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆయన 'ప్రజాశక్తి'తో పలు విషయాలు చెప్పారు. అవి..

ప్రతి క్షణం అమూల్యమైనదే..

అగ్ని ప్రమాదాలు తరచూ గృహాలు, కర్మాగారాలు, కార్యాలయాల్లో సంభవిస్తుంటాయి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి క్షణం అమూల్యమైందే. ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు కంగారు పడడం, పరిగెత్తడం చేయకూడదు. అందరిని అప్రమత్తం చేయాలి. ప్రమాదం నుంచి తప్పించుకునే మార్గాన్ని ఉపయోగించాలి. భవనంలో మెట్ల మార్గాన్ని మాత్రమే వినియోగించాలి. లిఫ్ట్ ఉపయోగించకూడదు. మీరు ఉన్న గది పొగలో చిక్కుకుని ఉంటే నేలపై బోర్లా పడి ప్రాకుకుంటూ బయటకు వెళ్లాలి. అగ్ని ప్రమాద సమయంలో మీరు గదిలో చిక్కుకుంటే తలుపులు, కిటికీలు పూర్తిగా మూసివేయాలి. ముక్కుకు, నోటికి తడి గుడ్డ కట్టుకుని నేలపై పాకుతూ బయటకు వెళ్లాలి. కాలుతున్న ఇంటిలోకి ఏ పరిస్థితిలో వెళ్ల రాదు. అగ్ని ప్రమాద సమయంలో తప్పించుకునే మార్గాలైన మెట్లు, వరండాలు, లాబీల్లో అడ్డుగా సామగ్రి పెట్టకూడదు. మీ విలువైన వస్తువులు, సామగ్రి కోసం ఆగకూడదు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

పొగ, విషవాయువులతో ప్రాణాంతకం..

అగ్ని ప్రమాదం ద్వారా వచ్చే మంటలు వేడిని, పొగ, విషవాయువులను ఉత్పత్తి చేస్తాయి. ఇవి వేడి కంటే ముందే చాలా వేగంగా వ్యాపించి ప్రాణాలు తీస్తాయి. కొద్దిగా పొగ, విషవాయువులను పీల్చుకున్నా కూడా మైకం (మబ్బు) కమ్ముతుంది. స్పృహ తప్పేలా చేస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తత..

గ్రామీణ ప్రాంతాల్లో గుడిసెలు, గడ్డి వాములు, తాటాకు పందిళ్లు మొదలగు వాటి దగ్గరలో ఎట్టి పరిస్థితిలోనూ టపాసులు కాల్చరాదు. ఎండు గడ్డిని ట్రాక్టర్లు, లారీలు, ఎడ్ల బండ్లపై తెచ్చే సందర్భాల్లో తక్కువ ఎత్తులోనే గడ్డి వేసుకుని తరలించాలి. లేదంటే దారిలో విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి, వాహనం కాలిపోయే ప్రమాదం ఉంది. విద్యుత్ తీగలకు దగ్గరలో వాటి కింద గడ్డి వాములు వేయకూడదు. గడ్డి వాములు నివాసాలకు దూరంగా ఉండాలి. గడ్డి వాములకు దగ్గరలో అద్దం ముక్కలు ఉండకుండా చూసుకోవాలి. అగ్ని ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు చెప్పే సమయంలో చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పాలి.

నీటి సమస్య ఉండదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రజలకు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. అమృత్ పథకం కింద రూ.120 కోట్లతో ప్రారంభించిన మంచినీటి పథకం 99శాతం పూర్తయిన సందర్భంగా స్థానికంగా ఉన్న రెండుకొళాయిల వద్ద ఆదివారం ఎమ్మెల్యే ట్రైల్‌రన్ పూర్తి చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మైలవరం నుండి 30 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ పూర్తి చేశామన్నారు. ఇక్కడ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా నీటిని శుద్ధి చేస్తామన్నారు. రెండు కొళాయిల వద్ద ఉన్న ట్యాంకుకు నీరు సరఫరా చేసి, ఇక్కడ నుండి భూగర్భంలో ఉన్న పైపుల ద్వారా పట్టణంలోని ట్యాంకులకు సరఫరా చేస్తామన్నారు. అక్కడి నుండి ఇంటి వరకు నీటిని అందజేస్తామన్నారు. భూగర్భ పైప్‌లైన్ నిర్వహణ పనులను పూర్తి చేసి నెలరోజుల్లో మంచినీటిని అందజేస్తామన్నారు. 2014-19 కాలంలో తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా మంచినీటి కోసం పలు ప్రజా ఉద్యమాలు చేసి చివరకు అసెంబ్లీలో మాట్లాడినా అప్పడి టిడిపి ప్రభుత్వం స్పందించలేద్నారు. స్థానిక టిడిపి నాయకులకు నిబద్ధత లేకపోవడం వల్ల మంచినీటి సమస్యను పరిష్కరిం చలేకపోయారన్నారు. తాను రెండవసారి ఎమ్మెల్యే అయ్యాక మంచినీటి సమస్య తీరుస్తామని ఇచ్చిన మాట మేరకు జగన్ ప్రభుత్వంలో విజయాన్ని సాధించామన్నారు. ఇది తన మున్సిపల్ పాలకవర్గం సాధించిన విజయంగా కొని యాడారు. ప్రజల నమ్మకాన్ని నిల బెట్టుకున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవలందించేందుకు ముందుంటామని రాచమల్లు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

అన్నదాత.. సుఖీభవ

- ఏడాదికిపైగా కొనసాగుతున్న రూ.10కే భోజనం



వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



బండలపై కూర్చొని తింటున్న ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రస్తుత తరుణంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ఒక కుటుంబం ప్రస్తుతం సరుకులు కొనాలంటే వేలాది రూపాయలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఇక పేదల పరిస్థితి ఆ సరుకులను కొనాలంటే గగనమే. కూలికెళుతూ జీవనం సాగించే వారు హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.130 నుంచి రూ.150 పెట్టాల్సిందే. ఈ నేపథ్యంలో పులివెందులలో పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ పేద వారి గురించి ఆలోచించి.. రూ.10కే రాగి ముద్ద, రెండు పచ్చడిలు, పప్పు అందిస్తున్నారు. ఏదైనా ఇతర కార్యక్రమాల్లో బిర్యానీ కూడా ఉచితంగానే ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు బిఎస్ఎన్ఎల్ సమీపంలో ఒక మొబైల్ వ్యానులో అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడాది క్రితం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. రోజుకు వందల సంఖ్యలోనే ఇక్కడ తిని వెళతూంటారు. నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదే అయినా.. రూ.10కే బోజనం అందించడం గొప్ప విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ తిన్న ప్రతి ఒక్కరూ అన్నదాత సుఖీభవ అంటూ ఆశీర్వదిస్తున్నారు.

కడుపునిండా తింటున్నాం



ప్రతిరోజు ఉదయం 11 గంటలకల్లా బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఒక మినీ ఆటోలో రాగి ముద్ద, భోజనం తెస్తున్నారు. తాము కూలి పని ముగించుకొని ఇక్కడ రూ.10ఇచ్చి కడుపునిండా తింటున్నాం. ఈవిధంగా భోజనం పెడుతున్న ఆయనను దేవుడు ఎల్లవేళలా చల్లగ చూడాలని కోరుతున్నాం.

- స్థానిక మహిళ

రుచిగా ఉంది.. అడిగినంత పెడుతున్నారు



ప్రతిరోజు మధ్యాహ్నం ఇక్కడ రాగి సంగటి తింటున్నాం. ఎంతో శుభ్రతతో ఉంటుంది. అడిగినంత పెడతారు. కూలికి వెళితే రూ.200 నుంచి రూ.300 వస్తుంది. అదే హోటల్‌కెళ్లి తినాలంటే ఇందులో సగం లెక్క మధ్యాహ్నం భోజనానికే సరిపోతుంది.

- బాబు, స్థానికుడు

చాలా తృప్తి, సంతోషంగా ఉంది

రూ.10కే పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రతిరోజూ రాగి ముద్ద, భోజనం రెండు పచ్చళ్ళతో పప్పును ఏర్పాటు చేసి ఆటో పంపుతున్నాం. కూలి పనికి వెళ్లే పేదలు భోజనం అందించాలనే ఆలోచన రావడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

- డాక్టర్ వి.వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్

చంద్రబాబుపై రాళ్లదాడి దుర్మార్గం : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై వైసిపి అరాచకవాదులు రాళ్ల దాడి చేయడం దుర్మార్గమైన చర్యగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్ అభివర్ణించారు. ఆదివారం స్థానిక ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కార్యాలయంలో వారు మాట్లాడుతూ జెడ్ ప్లస్ భద్రత ఉన్న చంద్రబాబుపై వైసిపి రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా దాడులకు దిగడం పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్రాభివృద్ధిని మరిచి చంద్రబాబు, నారా లోకేష్ పర్యటనలను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్ సభలకు వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. జగన్ సొంత బాబాయ్ వివేకా హత్య కేసు డైవర్ట్ చేయడానికి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఇందుకు నిదర్శనమన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ బాధ్యత మరిచి వీధి రౌడీలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దాడులు జరుగుతాయని పోలీసులకు ముందే తెలిసినా పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు. దాడిలో చంద్రబాబు భద్రత సిబ్బందికి గాయాలు కావడం పోలీసుల వైఫల్యమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప లీగల్ సెల్ కార్యదర్శి వినోద్‌కుమార్, వార్డు ఇన్‌ఛార్జి నీలాపురం బాషా, నాయక్, గురుస్వామి, జహీర్, అబ్దుల్ కలాం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లబోతుల నాగరాజు

వీధి కుక్కలతో బెంబేలు

వెంటపడుతున్న వైనం.. వాహనదారుల హడల్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని పలు వీధుల్లో కుక్కలు వాహన దారులను, ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ వీధుల్లో తిరగాలంటే వారు బెంబేలె త్తుతున్నారు. ఉదయం స్కూళ్లకు, కాలేజీకి వెళ్లే విద్యార్థులను అటుగా రాకపోకలు సాగించే కుక్కలు వెంటపడి పరిగెత్తిస్తున్నాయి. రాత్రి సమయాల్లో గుంపులుగా తిరుగుతూ.. రోడ్డు మీద వెళ్తున్న వాహనాలను వెంటబడుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులకు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. గాయపడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విచ్చలవిడిగా వీధుల్లో సంచరిస్తున్న కుక్కల బెడదను నివారించడంలో మున్సిపల్ అధికారుల ఉదాసీనత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఫలితంగా కుక్కలు రోజురోజుకు పెరిగిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్య తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

వెంటబడి కరుస్తున్నాయి



రాత్రి సమయాల్లో మోటర్ సైకిళ్లను వెంటపడుతూ కరుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కుక్కలు వెంటబడడతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లలు ఉన్న చోట కూడా కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. పిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

- విజయ్.సిఐటియు.జమ్మలమడుగు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ విజయభారతి

ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేస్తేనే భవిష్యత్ సుఖ సంతోషాలతో ఉంటుందని అక్షర మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజయభారతి, ఎస్‌టియు నాయకుడు సంఘమేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం శ్రీను ట్యుటోరియల్‌లో పదో వతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో నైపుణ్యం ఉండాలన్నారు. సోమరితనం, అంహకారం ఉంటే చదువులో రాణించలేరని తెలిపారు. నిరు పేద కుటుంబంలో పుట్టి పెరిగిన ఎపిజె అబ్దుల్ కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఓటమి నుండి బయట పడేందుకు ప్రయత్నించాలన్నారు. స్థిరమైన లక్ష్యం అనేది ఉంటే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను గుర్తుపెట్టుకోవాలని కోరారు. క్రమ శిక్షణకు మారుపేరుగా ఉన్న శ్రీను ట్యుటోరియల్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ట్యుటోరియల్ కరస్పాండెంట్ సందీప్, ఉపాధ్యాయులు అప్షనా, వెంకటేష్, కొమ్మెది విజయ్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దారెడ్డిపల్లెలో సందడి

ప్రజాశక్తి - చాపాడు

సిద్దారెడ్డిపల్లెలో ఆదివారం సందడి నెలకొంది. గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి స్థానికులు బోనాలు సమర్పించారు. అంతా ఐకమత్యంతో కార్యక్రమాన్ని ఆడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యాలతో, నృత్యాలతో సందడి చేశారు. ప్రతి వేసవికాలంలో ఇలా చేయడం గ్రామ ఆనవాయితీ.



బోనాలతో మహిళలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని నగరిగుట్ట వాటర్ ట్యాంక్ దగ్గర రోడ్డు పక్కన కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు అధికంగా ఉంటాయి. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కనే ఉండడంతో ఆ ప్రాంత వాసులు భయాం దోళనకు గురవుతున్నారు. చిన్న పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు. పాడి రైతులు ఎక్కువగా ఉన్నందున పశువులు తిరుగుతూ ఉంటాయి, ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదం జరిగితేగానీ సంబంధిత అధికారులకు సమస్యలు గుర్తుకు రావా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కంచెలేకుండా రోడ్డుపక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



వెదురూరు చెక్‌డ్యామ్ వద్ద ఉన్న నీరు

చెక్ డ్యామ్‌లకు జలకళ

ప్రజాశక్తి - చాపాడు

వేసవి ప్రారంభం అవడంతో వాగులు, వంకల్లో నీరు పూర్తిగా అడుగంటపోతుంది. కానీ చెక్ డ్యాంలున్న ప్రాంతాల్లో జలకళ సంతరించుకుంది. గత ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పనుల్లో భాగంగా మండల పరిధిలోని వంకల్లో పూడికతీత చేపట్టి, ఆ తర్వాత చెక్ డ్యాంలను నిర్మించారు. సిద్ధారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లి, వెదురూరు, చియ్యపాడు, చాపాడు, అల్లాడుపల్లె, వెదురూరు గ్రామాల వద్ద వంకల్లో పలు ప్రదేశాల్లో నీరు-చెట్టు పనుల్లో భాగంగా చెక్‌డ్యాంలను నిర్మించారు. నిర్మించిన ప్రదేశానికి ఎగువన నీరు 100 మీటర్ల వరకు మూడు అడుగుల లోతున నిలిచి ఉంటుంది. కెసి కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో వంకల్లో నీరు పుష్కలంగా ఉంది. కెసికి నీరు నిలుపుదల చేసిన రెండు నెలల వరకు చెక్ డ్యాంల వద్ద నీరు పుష్కలంగా ఉంటుంది. సిద్ధారెడ్డిపల్లె, బద్రిపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ డ్యాం వద్ద రజకులు తమ వృత్తిని చేసుకునేందుకు వేసవిలో నీరు అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ నీటి ఆధారంతో రైతులు వివిధ రకాల వేసవి పంటలు సాగు చేపడుతున్నారు. వంకల్లో నీరు నిలిచి ఉండడంతో ప్రజలకు ఉపయోగకరం. ప్రతి 300 నుంచి 400 మీటర్లకు చెక్‌డ్యాంలను ఏర్పాటు చేస్తే నీరు ఎక్కడికక్కడ నిలిచి ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చెక్‌డ్యాంల నిర్మాణాన్ని ఏమాత్రం చేపట్టలేదు. నీరు నిలుపుదల చేయగలిగితే చెక్ డ్యాంల సమీపంలోని గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి కొరత తీరుతుంది. కుందూ, కెసిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలో పది అడుగుల్లోనే నీరు లభ్యమవుతుంది. వేసవిలో క్రమేపీ తగ్గుతూ 100 అడుగులకుపైగా లోతుకు చేరుకొని నీటి కటకటకు దారి తీస్తుంది. సాధారణంగా మండల పరిధిలోని రెండు మూడు పంచాయతీలు మినహా మిగిలిన గ్రామాల్లో నీటి కొరత ఏ మాత్రం కనపడకపోవడం మంచి పరిణామం. ఎండ తీవ్రతను నీటి సంరక్షణలో భాగంగా నీటి వనరులను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఇరిగేషన్ అధికారులు అవసరమైన ప్రదేశాల్లో చెక్ డ్యాంలను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

రంజాన్ పండుగ పురస్కరించుకుని నగరంలోని శిల్పారామం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. ఆదివారం మిస్పా మూవీ సహకారంతో పులివెందులకు చెందిన ఎస్‌కె డాన్స్, కడపకు చెందిన ఆర్‌కె అకాడమీ వారు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సినీ, జానపద, హిందీ గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి చిన్నమండెం

మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేసిన తనిఖీల్లో భాగంగా పలు రికార్డును పరిశీలించారు. పోలీసులకు సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క పోలీసు బాధ్యతాయుతంగా మెలగాలని, ప్రతి ఒక్కరితో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉంటూ తమ విధిని నిర్వహించాలని, సూచనలు, సలహాలు ఇచ్చారు.



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి

టమో'రా'



భారీగా తగ్గిన మార్కెట్ ధరలు

పెరిగిన సాగు విస్తీర్ణం

ఖర్చులు అధికం.. ఆదాయం శూన్యం

పెట్టుబడులు కూడా మిగలని దుస్థితి

ఆందోళనలో రైతన్నలు

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గిపోయాయి. కిలో ధర రూ.5కు పడిపోయింది. దీంతో సాగు చేసిన రైతన్నలకు మాత్రం నష్టాలే మిగిలాయి. మండల వ్యాప్తంగా ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పంటను సాగు చేశారు. ప్రతి కూల వాతావరణం, ధరలు లేకపోవడంతో టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో వ్యయం చేసి సాగు చేసిన పంటకు దిగుబడి బావున్నా ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - రామసముద్రం

మల్చింగ్ పద్ధతిలో పండించే ప్రతి పంట అధిక దిగుబడులు వస్తాయని, కలుపు, కూలీల ఖర్చులు తగ్గుతాయని, పంటకు చీడ పీడల నుంచి రక్షణ కవచాలు ఏర్పాటు చేయడం వల్ల కలుపు నియంత్రణలో ఉంటుందని, రైతుకు అదనపు ఆదాయం చేకూరుతుందని ఆశతో ప్రతి టమాటో రైతు మల్చింగ్ కవర్లు వినియోగించి పంటలు



సాగు చేశారు. ఒక్కో ఎకరానికి దాదాపు రూ.1.20 లక్షల వ్యయం పెట్టుబడి వ్యయం అవుతున్నట్లు రైతులు అంటున్నారు. దుక్కి దున్నకాలు, మల్చింగ్ సాలు పోయడానికి, నార కొనుగోళ్లు, ఎరువులు, మల్చింగ్ పేపర్లు, డ్రిప్‌పైపులు, పివిసి పైపులు, పిచికారీ మందులు, మొక్కలు పడిపోకుండా నాటే కట్టెలు, నైలాన్ పుర్రెలు, కూలీలు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ప్రస్తుతం ధరలతో కనీసం పెట్టుబడులు కూడా మిగలని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా గత సంవత్సరం కురిసిన వర్షాలతో దాదాపు 16 పంచాయతీలలో బోర్లలో ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉన్నాయి. బోర్లలో కూడా నీరు వస్తుండటంతో రైతులు ఆనందంగా ఉన్నా, మరో వైపు అంచనాలకు మించి విస్తీర్ణం సాగు చేశారు. ప్రస్తుతం 25 శాతం పంటలు మార్కెట్ యార్డుకు వెళ్తున్న క్రమంలో ధరలు పడిపోవడం ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల కిందట వరకు కిలో టమోటా ధర రూ.5 నుంచి రూ.7 వరకు ఉండగా, ఉగాది తర్వాత ధర తగ్గింది. టమోటా సాగు విస్తీర్ణం పెరగడం, ఒక ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుండటం తదితర కారణాలతో మార్కెట్లలో ధర తగ్గిందని ఉద్యనవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ధర తగ్గడంతో వినియోగదారులకు ఊరట లభించక, సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

టమోటా సాగు విస్తీర్ణం పెరగడం కూడా ధర తగ్గడానికి కారణమైంది. గతంలో రామసముద్రం మండలంలో సాగు విస్తీర్ణం ఆరు వేల ఎకరాల కంటే తక్కువగా ఉండేది. ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు పైగా టమాటా సాగవుతోంది. వడగాలులు, గాలిలో తేమశాతం తగ్గడంతో పంటకు ప్రతికూలమైన వాతావరణం ఉండటంతో పూత రాలే అవకాశం ఎక్కువగా ఉండటంతో దిగుబడి తగ్గిందని ఉద్యనవన శాఖ అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం పంటలో నష్టపోయిన రైతులు ఈ సీజన్‌లో సాగుకు రైతులు ఆసక్తి చూపించారు. ప్రతికూల వాతావరణం, ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. కూరగాయల సాగు విస్తీర్ణంలో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల ఎకరాల్లో సాగు అవుతుండగా, ఒక్క రామసముద్రం మండలంలో రెండు వేల ఎకరాల్లో టమాటో పంటలు సాగవుతుంది.



సాగులో ఉన్న టమోటా పంట

నష్టం మిగ్చిలిన టమోటా

ఈ ఏడాది టమోటాను సాగు చేసిన రైతులకు ధర తగ్గడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఆటో ఛార్జీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పండుగకు ముందు మార్కెట్‌లో టమాటా ధర కిలో రూ.7లు పలికింది. అయితే మదనపల్లి మార్కెట్ యార్డ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి ఒకేసారి మార్కెట్లకు టమోటా రావడంతో వ్యాపారులు ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ వర్గాలు మాత్రం 15 రోజుల్లో ఢిల్లీ నుంచి వ్యాపారులు వస్తారని రైతుకు కొంత ఊరట లభిస్తుందని తెలుపుతున్నారు. గత ఏడాది రైతు ఉత్పత్తి దారుల సంఘం తరపున రైతు పొలంలోనే ట్రే టమోటా రూ.100 కు విక్రయాలు జరిపి కర్నాటకలోని శ్రీనివాసపురం ప్రాంతంలోని గుజ్జు తీసే ఫ్యాక్టరీకి తరలించామని అన్నారు. ఈ ఏటా మామిడి సీజన్ ప్రారంభం కావడంతో గుజ్జు తీసే ఫ్యాక్టరీలు కూడా టమోటా తీసు కోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, జిల్లా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి టమాటా రైతులను ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

మచ్చ పేరుతో ధర తగ్గిస్తున్నారు



ఎకరం పొలంలో టమాటా సాగు చేశాను. రూ.1.15 లక్షల వరకు పెట్టుబడి వచ్చింది. 40పెట్టెలు మార్కెట్‌కు తీసుకెళ్లాను. నాణ్యమైన సాహో రకం 30 కిలోలపెట్టె రూ.150 ప్రకారం 20 పెట్టెలు కొన్నారు. మరో 20 పెట్టెలు వర్షానికి మచ్చలు వచ్చాయని పెట్టె 70 లకు తీసుకున్నారు. అవి కూడా బాగానే ఉన్నా.. మచ్చల పేరుతో ధరలను తగ్గించి దగా చేస్తున్నారు. వినియోగదారులకు మార్కెట్లో కిలో రూ.24-35ల వరకు విక్రయిస్తున్నారు. రేయింబవుళ్ల కష్టపడితే పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. **- రమేష్, రైతు, ఆర్.నడింపల్లి**

ఉత్పత్తి పెరగడమే కారణం

మండలంలో గత ఏడాదికి మించి ప్రస్తుత సీజన్‌లో టమాటా సాగు విస్తీర్ణం పెరిగింది. టమాటా ఉత్పతి పెరగడంతో ధర తగ్గింది.

- ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి ఉద్యనవనశాఖ అధికారి

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని బిజెపి సారధ్యంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధం కావాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు సిపిఐ పి.ఎల్.నరసింహులు, పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జ్యోతి చౌక్‌లో సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గం కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ- అమిత్ షా నాయకత్వంలో బిజెపి- ఆర్‌ఎస్‌ఎస్ కూటమి దేశంలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మత విద్వేషాల చిచ్చు రాజేస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ఆదాని,అంబానీ లాంటి సంపన్నులకు దేశ సంపదను అప్పనంగా దోచిపెడుతోందని విమర్శించారు. ప్రజలందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వం రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని, ఆఖరికి మనందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అడవులను, భూములను, విద్యుత్తు ప్రాజెక్టులను, గనులను సైతం కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతుందన్నారు. అనంతరం సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.కృష్ణప్పలు మాట్లాడుతూ రాష్ట్రానికి ఆయువు పట్టు లాంటి విశాఖ ఉక్కును ఆదానికో, జిందాల్ కో మరో కార్పొరేట్ రాబందుకో కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తోందని వాపోయారు. బహిరంగ సభ ప్రారంభానికి ముందు ప్రజానాట్య మండలి కళాకారులు విజయ్, వెంకటాచలపతి ఆధ్వర్యంలో విప్లవ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ, సీనియర్ నాయకులు యస్.బషీర్ ఖాన్, సిపిఐ మండల నాయకులు ఎస్.సలీంబాష, ఎం.అష్రఫ్ అల్లి, హెచ్.షమీవుల్లా, ఎస్.తంబయ్యశెట్టి, పి.నారాయణస్వామి, ఎస్.జవహార్ బాబు, కె.బాలకృష్ణ, కె.రమేష్ రెడ్డి, పి.మంజునాథ్, గంగులప్ప, బాబు, రియాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్ : సిపిఎం, సిపిఐ ప్రచార భేరిని ఆదివారం నీరుగట్టుపల్లిలో చేనేత కార్మికులతో కలిసి నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమలు దేశంలో దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని, పైగా వాటి ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం 5 శాతం నుంచి 12 శాతానికి జిఎస్‌టి పెంచడం దారుణమన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జీవనోపాధి కోసం మగ్గాలు నడుపుకుంటున్న కార్మికులు, చేనేత, హస్త కళల కార్మికుల బతుకులు ఆగమవుతాయని, చేనేత రంగాన్ని నిలబెట్టడానికి కేంద్రం ప్రత్యేకంగా ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పన్ను పెంపు ప్రతిపాదనను పరిశ్రమ వర్గాలు, అనేక రాష్ట్రాలు సైతం వ్యతిరేకించాయని, ముడి పదార్థాల ధరలు పెరగటం, ప్యాకేజింగ్,సరుకు రవాణా ఖరీదుగా మారటంతో ఎంతోమంది చేనేత కార్మికులు, కళాకారుల జీవితాల్ని తలకిందులు చేసిందన్నారు. ఇది చాలదన్నట్టుగా మోడీ ప్రభుత్వం ఇప్పుడు పన్నులు పెంచితే కొన్ని లక్షల హ్యాండ్‌లూమ్స్ యూనిట్లు మూలనపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు తిరుమల, దేవా, రవి, రెడ్డప్ప, నాగరాజా పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

ఆర్గనైజేషన్ పేరిట మహిళలకు కుచ్చుటోపీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని మదన గోపాలపురంలో రూరల్ కింగ్డమ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ పేరిట నిర్వాహకులు మహిళలకు కుచ్చు టోపీ పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్వాహకులు రాధాకృష్ణ, పరశురాములు మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తామని, మహిళలకు టైలరింగ్ నేర్పిస్తామని ప్రలోభ పెట్టి రూ. 600 చొప్పున 120 మంది దగ్గర సుమారు రూ. 75 వేలు వసూలు చేశారు. నాలుగు నెలలు శిక్షణ ఇచ్చిన అనంతరం శిక్షణా కేంద్రంలో నాలుగు కుట్టు మిషన్లను వదిలివేసి ఇంటి అద్దె కూడా చెల్లించకుండా నిర్వాహకులు పరారైనట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. కట్టిన సొమ్ము చెల్లించాలని బాధితులు వేధిస్తున్నారని కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చిన శ్రీలేఖ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఒత్తిడి భరించలేక నిర్వాహకులకు ఫోన్ చేస్తే బెదిరిస్తున్నారని లేదా స్విచ్ ఆఫ్ చేసుకుని తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని శిక్షకులు విలపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు మొరపెట్టుకుంటున్నారు.



బాధిత మహిళలు



వీధి కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

వీధి కుక్కల నివారణకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపల్ అధికారులు పట్టణంలో వీధి కుక్కల బెడదను నివారించడానికి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన అనిమల్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ద్వారా పట్టణంలోని వివిధ వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను పట్టి తిరుపతిలోని ప్రత్యేక కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా వీధుల్లో వీధికుక్కల సంచారిస్తే సచివాలయ సిబ్బందికి కానీ, మున్సిపల్ అధికారులకు కానీ సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ప్రజలు ఇళ్లల్లో మిగిలిన ఆహార వ్యర్థాలు రోడ్లపై, ముగురు కాలువల గట్లపై పారావేయకుండా, మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందివ్వాలని చెప్పారు. అప్పుడే వీధుల్లో కుక్కల సంచారం అరికట్టవచ్చని ఆయన తెలిపారు. పట్టణంలో ఉన్నమొత్తం వీధికుక్కలు పట్టే విధంగా ప్రత్యేక ప్రణాళిక చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం బస్టాండ్, గాలివీడురోడ్, రామాపురం, కొత్తపేట, బోస్ నగర్ ప్రాంతాల్లో కుక్కలను పట్టించినట్లు మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య తెలిపారు.

34 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్న ముక్కపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 34 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, యర్రావారిపాలెం,కేవీ పల్లి, కదిరి,ఎన్.పి.కుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 70 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 34 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష. ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి ఆసుపత్రి కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, లయన్ జయరామిరెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

రైతు బజార్ల అభివృద్ధే ధ్యేయం

జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి టి.త్యాగరాజు

ప్రజాశక్తి రాయచోటి

జిల్లాలోని మార్కెటింగ్ శాఖలో రైతు బజార్లను అభివృద్ధి చేయడమే తమలక్ష్యమని జిల్లా వ్యవసాయ వాణిజ్య,మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి టి. త్యాగరాజు పేర్కొన్నారు. జిల్లాలో మార్కెట్ యార్డులు, రైతు బజార్‌లో వ్యాపారులకు, ప్రజలకు మెరుగైన నాణ్యమైన సరుకులు విక్రయించి ఎలా ఆదాయం పొందాలో ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో వివరించారు.



ముఖా ముఖి..

జిల్లాలో రైతు బజార్ వివరాలు తెలపండి ?

అన్నమయ్య జిల్లాలోరైతు బజార్‌ను ఏర్పాటు చేసి ఏడాదైంది. రాయచోటిలో ఇటీవల కాలంలో వైయస్సార్ రైతు బజారు ఏర్పాటు చేశాం. రైతు బజార్‌లో 53 స్టాల్స్‌ను రైతులకు కేటాయించాం. డ్వాక్రా మహిళా గ్రూపు వారికి చిరుధాన్యాల విక్రయం కోసం డిఆర్‌డిఎ ప్రతిపాదనతో ఒక గదిని కేటాయించాం. రైతు బజార్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. కలెక్టర్ గిరీషా, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా ప్రత్యేక చొరవతో వారి సలహాలు, సూచన మేరకు రైతుబజారు అభివృద్ధికి కృషి చేస్తున్నాం . మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వ్యవసాయ జిల్లా మార్కెట్ సలహా మండలి సభ్యులు దిన్నెపాడు రవిరాజు సహకారంతో రైతు బజార్లు అభివృద్ధి బాటలో నడిపించడానికి కృషి చేస్తున్నాం .

జిల్లాలో మార్కెటింగ్ కమిటీలు ఎన్ని ? వాటి ఆదాయం ఎంత?

జిల్లాలో మార్కెటింగ్ కమిటీలు 10 ఉన్నాయి . జిల్లా వ్యాప్తంగా 2022 - 2023 సంవత్సరానికి గాను రూ 889.00 లక్ష్యం కాగా రూ. 648.39 పూర్తి చేసి జిల్లా వ్యాప్తంగా 73 శాతం పూర్తి చేశాం .రాయచోటి యార్డులో 69 శాతం , రాజంపేటలో 55 శాతం , ములకలచెరువులో 01 శాతం , అంగళ్లలో 89శాతం, వాల్మీకిపురంలో 75 శాతం, కలికిరిలో 105 శాతం , పీలేరులో 42 శాతం , లక్కిరెడ్డిపల్లెలో 118 శాతం, మదనపల్లెలో 62 శాతం, రైల్వే కోడూరులో 68 శాతం లక్ష్యాన్ని పూర్తిచేశాం. రైతు బజార్ విషయానికొస్తే జిల్లాలో ఒకటి మాత్రమే ఉంది. మరొకటి నూతనంగా ప్రారంభించాం. నష్టాలు వస్తున్నాయని, వ్యాపారులు చెబుతున్నారు. కనీసం స్టాల్‌కు రూ.500 చెల్లించాలని కోరుతున్నాం. రైతు బజార్లను ఆదాయ మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తాం.

నూనత రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నారా?

మార్కెట్ యార్డులో రైతు బజార్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం . కమిషనర్ ఆదేశాల మేరకు పీలేరు, కలికిరిలో ప్రాంతాలలో అనువైన ప్రాంతాలుగా గుర్తించాం. త్వరలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రాయచోటి రైతు బజార్‌లో వాచ్‌మెన్‌ను నియమించాం. భవిష్యత్తులో ఆదాయం వచ్చిన తర్వాత మరింత సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని ఎపిజిఇఎ జిల్లా ఎర్రపు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సుధాకర్ రాజు పేర్కొన్నారు .ఆదివారం మదనపల్లి రోడ్డులోని జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్ర ప్రతినెలా ఒకటి తేదీనే వేతనాలు అందించాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ , రూల్స్ న్యాయపరమైన ఇబ్బందులను తొలగించడానికి కృషి చేయాలన్నారు . కార్యదర్శులు గ్రేడ్లు 6 స్థానంలో, 2 లేక మూడుకు కుదించి , పెన్షనర్ల, కంటింజెంట్, కాంట్రాక్టు, ఆర్‌టిసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆరోగ్య శాఖ ఉద్యోగులపై అదనపు భారం తగ్గించాలని, ఫేషియల్ యాప్ రద్దు చయాలని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని అనేక పర్యాయాలు విన్నవించినా సరైన స్పందన లేకపోవడం వల్ల ఈ నెల 30న రాజమహేంద్రవరంలో ఎపిజిఇఎ రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం. రెడ్డి నాయక్, ప్రవీణ్ కుమార్ రాజు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు , రాయచోటి తాలూకా అధ్యక్షులు ఓ. సాయి కుమార్, కార్యదర్శి సుజిత్, లక్కిరెడ్డిపల్లి తాలూకా అధ్యక్షులు తిమ్మారెడ్డి, కార్యదర్శి దేవేంద్ర రెడ్డి, మదనపల్లి తాలూకా అధ్యక్షులు నాగేంద్ర బాబు, ఐఎన్‌టియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, క్రిష్ణయ్య, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు పి. రాజా, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ ఎం. సిద్దయ్య నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కంటి చూపుతో జీవితానికే వెలుగు

-ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

పేదలకు కంటి చూపును ప్రసాదించడం వారి జీవితానికే వెలుగు నివ్వడమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంబేపల్లె మండలంలోని మోటకట్ల గ్రామంలో పలవుల సుబ్బారెడ్డి, వాసుదేవమ్మ దంపతుల స్మారకార్థం సర్పంచ్ రాధిక, అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన తిరుపతి ఎస్‌వి అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అరవింద్ కంటి ఆసుపత్రి ఎందరో అభాగ్యులకు కంటిచూపునివ్వడం ఆనంద దాయకమన్నారు. మోటకట్ల శివ సాయి ఆలయం ట్రస్టు తరుపున రెండవసారి కంటి వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. మారుమూల గ్రామాల్లో ఉచిత క్యాంపు నిర్వహించి పేదలకు కంటిచూపు ఇవ్వడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. దాతలు ముందుకు వచ్చి కార్పొరేట్ కంటి వైద్యాన్ని ఉచితంగా పేదలకు అందించి వారికి సేవ చేస్తుండడం మహాభాగ్యమని తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ మహేష్, నందిని, గాయత్రి ఆధ్వర్యంలో 20 మంది కంటి వైద్య సిబ్బంది 180 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు .అందులో కంటి సమస్యలున్న 39 మందిని గుర్తించి వారిని ఆపరేషన్ నిమిత్తం వెంటనే బస్సులో ఉచితంగా తిరుపతి అరవింద ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉచితంగా ఆపరేషన్లు చేసి తిరిగి వారి స్వగ్రామాలకు పంపుతామని క్యాంపు మేనేజర్ జీవన్ రావు తెలిపారు. కార్యక్రమంలో శివ సాయి దేవాలయం ట్రస్ట్ సభ్యులు, విశ్రాంత అడిషనల్ ఎస్‌పి వెంకట నాథ్ రెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మండల వైఎస్ఆర్ సిపి నాయకులు గొర్ల రమేష్ రెడ్డి, ఎంపిటిసి కాకులపల్లె రమణా రెడ్డి, నియోజక వర్గ బిసి సెల్ కార్యదర్శి నాగరాజు యాదవ్, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి, జె సి ఎస్ మండల కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి, ఉప సర్పంచ్ సుధీర్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ మధు, పెద్ద రామయ్య పాల్గొన్నారు.

నేడు 'దిశ' కమిటీ సమావేశం

ప్రజాశక్తి రాయచోటి

రాజంపేట ఎంపీ , లోక్ సభ స్పీకర్ ప్యానల్ మెంబర్ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు దిశ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు దిశ కమిటీ కన్వీనర్ , కలెక్టర్ గిరిషా పిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. సంబంధితాధికారులు పథకాలపై రిపోర్టులను తీసుకురావాలన్నారు. సమీక్షకు జిల్లాలోని ఎమ్మెల్యేలను, ఉమ్మడి కడప , చిత్తూరు జిల్లాల జడ్‌పి చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.


మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

చంద్రబాబుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-చిట్వేల్

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాళ్లతో దాడి చేయడాన్ని జిల్లా సిపిఎం నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.చంద్రశేఖర్, పందికాళ్ల మణి, తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పక్ష నేత పర్యటనకు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. మంత్రి ఆదిమూల సురేష్ స్వయంగా చొక్కా విప్పి నిరసన తెలపడం, రెచ్చగొట్టడం వల్ల చంద్రబాబుపై దాడి జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా శాంతి యుతంగా ప్రచారం చేసుకోవచ్చని, అధికార పార్టీ వారు రెచ్చగొట్టడం ఫలితంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలకు సభలకు భద్రత కల్పించడంతోపాటు సొంత పార్టీ వారు రెచ్చగొట్టకుండా అదుపులో పెట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై ఉందని తెలిపారు. అక్కడ శాంతిభద్రతలను అదుపు చేయ డంలో పోలీసుల విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాళ్లతో దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఒబిలి పెంచలయ్య, కరతోటి హరి నారాయణ, బొజ్జ శివయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కె.కె చౌదరి

ప్రజాశక్తి-చిట్వేల్


నారా లోకేష్‌కు మెమొంటో అందిస్తున్న కె.కె.చౌదరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండలం టిడిపి అధ్యక్షులు కెకె.చౌదరి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం మొదలైనప్పటి నుంచి అనేక సవాళ్లు, కష్టసుఖాలు, జనతో ఆశీర్వాదాలు స్వీకరిస్తూ పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లకు చేరుకోవడం చరిత్రాత్మకమన్నారు. చరిత్రను తిరగరాసే ఈ ప్రయాణంలో భాగస్వాములం ఉంటూ లోకేష్‌తో కలిసి నడవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పాదయాత్ర మొదలైనప్పటి నుంచి ప్రజలు తండోపతండాలుగా వస్తూ వారి సమస్యలను ప్రస్తుత పాలకులు పెడుతున్న ఇబ్బంది పరిస్థితులను గమనిస్తుంటే బాధాకరం అన్నారు. రాష్ట్రానికి మంచి మంచి రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. అనంతరం వెయ్యి రోజులు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా లోకేష్‌కు మెమెంటో అందజేశారు.


ఆలయ మర్యాదలతో జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

సౌమ్యనాథుని సన్నిధిలో విజయనగరం జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయాన్ని ఆదివారం విజయనగరం జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్ట గురించి వివరించి ఆలయ మర్యాదలతో శాలువా, పూలమాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమములో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన మహాభారత యజ్ఞం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన రామాపురంలో పంచమ వేద మహాభారత యజ్ఞం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. 18 రోజులపాటు జరిగే ఈ మహాభారత యజ్ఞానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోప తండాలుగా ప్రజలు హాజరయ్యారు. డివిజెర్. సీతామాలక్ష్మి మహాభారతయజ్ఞాన్ని హరికథ రూపంలో చెప్పారు. మొదటి రోజు సర్వయాగము, వ్యాస జననం హరికథ రూపంలో ప్రజలకు వివరించారు. రాత్రి సమయంలో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి లక్కిరెడ్డిపల్లి వారు మహాభారత యజ్ఞాన్ని వేషధారణలో ప్రజలకు కనువిందు చేశారు. మహాభారత యజ్ఞాన్ని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. నాగ ఓబుల్‌రెడ్డి ప్రసాద్‌రెడ్డి, దామోదరనాయుడు, భక్తవత్సలరెడ్డి మహాభారత యజ్ఞ నికి సహకారాలు అందించారు. ఈ మహాభారత యజ్ఞం నిర్వహణలో 18 రోజులపాటు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహణ చేపడుతున్నట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ రెడ్డి తెలిపారు.

పాలకులు మారినా..సమస్యలు తీరలేదు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

పాలకులు మారుతున్నారు కానీ పట్టణంలో సమస్యలు మాత్రం తీరడం లేదని మదనపల్లి రూరల్ మండలం బైపాస్ కాలనీ ప్రజలు, జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్‌చౌదరి ఎదుట వాపోయారు. రూరల్ మండలంలో జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐటి విభాగం నాయకులు జగదీష్, కుమార్, రెడ్డెమ్మ, స్వాతి పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఇందులో అధ్యక్షులుగా మదనపల్లికి చెందిన బండపల్లి వెంకట్రమణ, గౌరవ అధ్యక్షులుగా ఆర్‌కె.లక్ష్మి రమణ, చిత్తూరు, కార్యదర్శిగా ఎం.వెంకట్రమణ, కలకడ, కోశాధికారిగా నారుశేఖర్, రాయచోటి, ఉపాధ్యక్షులుగా మంచూరి జయరాం, బద్రి వెంకటరమణ, బి.శంకర, ఎడమడకల జంగయ్య, బద్రిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా కోపతాటి వెంకటసుబ్బయ్య, ఒంగోటూరి చంద్రశేఖర్, పోతబోలు వెంకటేష్, టి.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా పెనగలూరి సురేష్‌బాబు, పొట్టెంప్రకాష్ రావు, కొండయ్య కార్యవర్గ సభ్యులుగా 17 మంది ఎన్నికయ్యారు.


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పురాతన బౌద్ధ ఆరామాలను కాపాడాలి

ప్రజాశక్తి-నందలూరు

పురాతన బౌద్ధ ఆరామాలను కాపాడాల్సిన అవసరం, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ సంస్థ అధ్యక్షులు కుమారస్వామి, కార్యదర్శి బండి లెనిన్ ప్రసాద్ ఉపాధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్, శివారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం ఆడపూరులోని బౌద్ధ స్థూపాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బౌద్ధ స్తూపాలను క్రీస్తు పూర్వ పూర్వం రెండవ శతాబ్దంలోని అశోకుని కాలంలోనివని వీటిని పర్యాటక, పురావస్తు శాఖ ఆధీనంలో సంరక్షిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇచ్చట గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయన్నారు. పర్యాటకులు ఆకర్షించడానికి ప్రభుత్వం చొరవ చూపి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యాటక శాఖ వారు దాదాపు కోటి రూపాయలు పైగా నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేశారని, స్థూపాలకు వెళ్లే దారిలో కంపచెట్లు తొలగించి దారి ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా బౌద్ధ ఆరామాలను సంరక్షించుకునేందుకు చొరవ చూపాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని అతి పురాతనమైన చారిత్రక ప్రదేశాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ ట్రెజరర్ శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ పుత్తా శివారెడ్డి, సుధాకర్, న్యాయవాది షేక్ మొహమ్మద్‌అలీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


బౌద్ధ అరామాల అభివృద్ధిపై చర్చిస్తున్న సొసైటీ సభ్యులు


గ్రామస్తులకు విరాళాన్ని అందిస్తున్న శ్రీరామనేని జయరామనాయుడు

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని అరికెల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణముకు మదనపల్లి టిడిపి నాయకులు శ్రీరామనేని జయరామ నాయుడు రూ.50 వేలు వితరణ చేశారు. ఆదివారం అరికల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు విరాళం కోసం మదనపల్లిలోని శివనగర్ ఉన్న జయరామ నాయుడు ఇంటికి వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్మవారిపల్లి చలపతినాయుడు, మహేష్ రెడ్డి, గ్రామస్తులు మోహన, రమణారెడ్డి, విజయ్‌కుమార్, మంజునాథ్, భాస్కర్‌నాయుడు, విశ్వనాథ నాయుడు, సదాశివరెడ్డి, రమణ పాల్గొన్నారు.


సంస్థ డైరెక్టరీ ఆవిష్కరిస్తున్న మానవతా సభ్యులు

మానవత స్వచ్ఛంద సంస్థ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సంస్థ ముఖ్య లక్షణమని వై.ప్రసాద్, బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు.ఆదివారం సాయంత్రం మానవత సంస్థ నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ బాలసుబ్రమణ్యం, జిల్లాఅధ్యక్షులు వై.ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, చైర్మన్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మానవత శాఖ అనేక సేవా కార్యక్రమలు ఉచిత బాడీ ఫ్రిజర్, శాంతిరథం, రాయచోటి వారి సహాయంతో అంబులెన్సు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.25వేలు ఆర్థిక సాయం, ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నదన్నారు. వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఆశయాలను మానవతా కుటుంబ సభ్యులందరూ కలిసి కృషి చేయాలన్నారు. ఈ సంద ర్భంగా కార్యదర్శి బాలాజిరెడ్డి, జిల్లా నాయ కులు ఎస్.నరసింహారెడ్డి, టి.రవీంద్ర, కోశాధికారి శివయ్య, కార్యవర్గం డైరెక్టరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ బాలాజీరెడ్డి, కోశాధికారి శివయ్య, జిల్లా డైరెక్టర్లు సామాల నరసింహారెడ్డి, టి.రవీంద్ర, వి రాజారెడ్డి, రమణారావు, రక్తనిధి పక్కీరయ్య, రామచంద్ర, బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో సుమారు 22 నెలలు పాటు భాద్యతలు నిర్వహించిన ఎస్ఐ వెంకటేష్ బదిలీపై మదనపల్లి తాలూకా పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆదివారం ఎస్ఐను స్థానిక పోలీసులు సిబ్బంది, స్థానికులు పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది శివ,శ్యాము, కృష్ణ, నిజం జయసుబ్బు, నరశింగరావు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

రంజాన్ పండుగ పురస్కరించుకుని నగరంలోని శిల్పారామం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. ఆదివారం మిస్పా మూవీ సహకారంతో పులివెందులకు చెందిన ఎస్‌కె డాన్స్, కడపకు చెందిన ఆర్‌కె అకాడమీ వారు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సినీ, జానపద, హిందీ గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

లక్షలు వెచ్చించారు.. వినియోగం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు ప్రయోజనం చేకూరడం లేదు. ప్రజల దాహార్తి తీర్చడం కోసం గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున శుద్ధి నీటి కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రజలకు సురక్షిత జలాలను అందించాలనే లక్ష్యంతో తక్కువ ధరకే శుద్ధి నీటిని అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పత్తూరు, తవ్వారిపల్లె, ఖాజీపేట తదితర గ్రామాల్లో ఎంపీ గ్రాంట్ నిధులతో దాదాపు నాలుగు లక్షల ఇరవై రూపాయల విలువైన శుద్ధి నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో బాగా ఆదరణ ఉండేది. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వహణ లోపం కారణంగా అవి మూతపడ్డాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత జలాలు అందడం లేదు. ప్రైవేట్ శుద్ధినీటి కేంద్రాలకు వెళ్లి మంచినీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నిరుపయోగంగా ఉన్న శుద్ధినీటి కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి సురక్షిత జలాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేస్తేనే భవిష్యత్ సుఖ సంతోషాలతో ఉంటుందని అక్షర మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజయభారతి, ఎస్‌టియు నాయకుడు సంఘమేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం శ్రీను ట్యుటోరియల్‌లో పదో వతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో నైపుణ్యం ఉండాలన్నారు. సోమరితనం, అంహకారం ఉంటే చదువులో రాణించలేరని తెలిపారు. నిరు పేద కుటుంబంలో పుట్టి పెరిగిన ఎపిజె అబ్దుల్ కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఓటమి నుండి బయట పడేందుకు ప్రయత్నించాలన్నారు. స్థిరమైన లక్ష్యం అనేది ఉంటే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను గుర్తుపెట్టుకోవాలని కోరారు. క్రమ శిక్షణకు మారుపేరుగా ఉన్న శ్రీను ట్యుటోరియల్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ట్యుటోరియల్ కరస్పాండెంట్ సందీప్, ఉపాధ్యాయులు అప్షనా, వెంకటేష్, కొమ్మెది విజయ్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి రౌడీలా ప్రవర్తించడం సిగ్గుచేటు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ రోడ్డు మీద చొక్కా విప్పి వీధి రౌడీలా ప్రవర్తించడం సిగ్గుచేటని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రగొండ పాలెంలో టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి దాడులు గర్హనీయమన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వమే ఆ సమస్యలను సృష్టించడం దురదృష్టకరమన్నారు. మంత్రి ఆది మూలపు సురేష్‌ను ముఖ్య మంత్రి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు మార్గాన కాకుండా వీర జవాన్లను వాయు మార్గాన తరలించేందుకు విమానాలు సమ కూర్చి ఉంటే 2019లో పుల్వామా దుర్ఘటనలో 40 మంది జవాన్లు చనిపోయి ఉండేవారు కాదని చెప్పినందుకు నాటి గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై మోడీ ప్రభుత్వం కక్ష సాధించడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం జవాన్ల ప్రాణాలను బలి పెట్టడం దుర్మార్గం అన్నారు. ప్రధాన మంత్రి పదవిని త్యాగం చేసిన రాహుల్ గాంధీకి ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయడం ఒక లెక్క కాదన్నారు. దేశంలో ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడిందని తెలిపారు. బిజెపి కక్ష సాధింపు చర్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని విమర్శించారు. బిజెపి సెల్ఫ్‌గోల్ కొట్టుకుం టోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని నగరిగుట్ట వాటర్ ట్యాంక్ దగ్గర రోడ్డు పక్కన కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు అధికంగా ఉంటాయి. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కనే ఉండడంతో ఆ ప్రాంత వాసులు భయాం దోళనకు గురవుతున్నారు. చిన్న పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగు తుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదం జరిగితేగానీ అధికారులకు సమస్యలు గుర్తుకు రావా అనిప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అన్నదాత.. సుఖీభవ

- ఏడాదికిపైగా కొనసాగుతున్న రూ.10కే భోజనం


వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్


బండలపై కూర్చొని తింటున్న ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రస్తుత తరుణంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ఒక కుటుంబం ప్రస్తుతం సరుకులు కొనాలంటే వేలాది రూపాయలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఇక పేదల పరిస్థితి ఆ సరుకులను కొనాలంటే గగనమే. కూలికెళుతూ జీవనం సాగించే వారు హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.130 నుంచి రూ.150 పెట్టాల్సిందే. ఈ నేపథ్యంలో పులివెందులలో పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ పేద వారి గురించి ఆలోచించి.. రూ.10కే రాగి ముద్ద, రెండు పచ్చడిలు, పప్పు అందిస్తున్నారు. ఏదైనా ఇతర కార్యక్రమాల్లో బిర్యానీ కూడా ఉచితంగానే ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు బిఎస్ఎన్ఎల్ సమీపంలో ఒక మొబైల్ వ్యానులో అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడాది క్రితం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. రోజుకు వందల సంఖ్యలోనే ఇక్కడ తిని వెళతూంటారు. నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదే అయినా.. రూ.10కే బోజనం అందించడం గొప్ప విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ తిన్న ప్రతి ఒక్కరూ అన్నదాత సుఖీభవ అంటూ ఆశీర్వదిస్తున్నారు.

కడుపునిండా తింటున్నాం



ప్రతిరోజు ఉదయం 11 గంటలకల్లా బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఒక మినీ ఆటోలో రాగి ముద్ద, భోజనం తెస్తున్నారు. తాము కూలి పని ముగించుకొని ఇక్కడ రూ.10ఇచ్చి కడుపునిండా తింటున్నాం. ఈవిధంగా భోజనం పెడుతున్న ఆయనను దేవుడు ఎల్లవేళలా చల్లగ చూడాలని కోరుతున్నాం.

- స్థానిక మహిళ

రుచిగా ఉంది.. అడిగినంత పెడుతున్నారు



ప్రతిరోజు మధ్యాహ్నం ఇక్కడ రాగి సంగటి తింటున్నాం. ఎంతో శుభ్రతతో ఉంటుంది. అడిగినంత పెడతారు. కూలికి వెళితే రూ.200 నుంచి రూ.300 వస్తుంది. అదే హోటల్‌కెళ్లి తినాలంటే ఇందులో సగం లెక్క మధ్యాహ్నం భోజనానికే సరిపోతుంది.

- బాబు, స్థానికుడు

చాలా సంతోషంగా ఉంది

రూ.10కే పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రతిరోజూ రాగి ముద్ద, భోజనం రెండు పచ్చళ్ళతో పప్పును ఏర్పాటు చేసి ఆటో పంపుతున్నాం. కూలి పనికి వెళ్లే పేదలు భోజనం అందించాలనే ఆలోచన రావడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

- డాక్టర్ వి.వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్


హార్సీలీహిల్స్ పార్కులో సరదాగా ఆడుకుంటున్న పిల్లలు


హార్సీలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని పర్యాటక కేంద్రం హార్సీలీహిల్స్ పర్యాటకుల తాకిడితో సందడిగా మారింది. ముఖ్యంగా రంజాన్ పర్వదినాన్ని పురస్క రించుకొని ముస్లిం సోదరులు వనభోజనాల్లో భాగంగా బంధుమిత్రులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. పిల్లలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు హార్సీలీహిల్స్ అందాలు ప్రకృతి రమణీయమని, వేసవి తాపం నుండి ఉపశమనం లభించిందన్నారు. పర్యాటక శాఖ అధికారులు అన్ని వసతులు కల్పించారు. ఇక వేసవి కాలం కావ డంతో పర్యాటకులు నిరంతరం హార్సీలీహిల్స్‌కు వచ్చి విశ్రాంతి తీసుకుంటారు.

నేడు చెన్నైకి కొత్త బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు


డిపో మేనేజర్ బండ్ల కుమార్

పీలేరు నుంచి తిరుపతి మీదుగా చెన్నైకి సోమవారం కొత్త బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సు సర్వీస్ పీలేరులో ఉదయం 6 గంటలకు బయలుదేరి 7.30కు తిరుపతి చేరుకుంటుందని అన్నారు. తిరిగి 7.45 గంటలకు అక్కడి నుండి పుత్తూరు, పిచ్చాటూరు, నాగలాపురం, ఊతుకోట, ,పెరియపాలెం మీదుగా చెన్నైలోని మాధవరం బస్ స్టేషన్ కు ఉదయం 11.45 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి చెన్నై నుండి మధ్యాహ్నం 1గంటకు బయలుదేరి తిరుపతికి సాయంత్రం 4.30 గంటలకు చేరుకుని, తిరుపతి నుండి 4.45 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.15 గంటలకు పీలేరుకు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ చెన్నై బస్సు సర్వీసును పీలేరు, పరిసర గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

ఘనంగా శ్రీ ఉమామహేశ్వరుల కల్యాణం

రాజంపేట అర్బన్ : పట్టణంలోని గడ్డివీధిలోని బసవేశ్వర స్వామి మఠంలో మఠాధిపతి రుద్రమూర్తి, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం అక్షయ తృతీయ శ్రీ బసవ జయంతిని పురస్కరించుకొని శ్రీ ఉమామహేశ్వరల అభిషేకం, కుంకు మార్చన, కల్యాణ మహోత్సవాన్ని పులివెందుల మిట్ట మల్లేశ్వర స్వామిదేవస్థానం ప్రధాన అర్చకులు రుద్రమూర్తిస్వామి, బసవరాజుస్వాముల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా, కనులపండుగగా నిర్వహించారు. కల్యాణన్ని తిలకిం చేందుకు రాజంపేట పరిసరప్రాంతాల లోని భక్తులు అశేషంగా పాల్గొని తీంర్థప్రసదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం అన్న దానం, గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బలిజ సామాజికవర్గం పాతికేళ్లుగా ఎదురుచూస్తున్న కల సాకారం కానున్నదని, 25 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ బలిజల మనోభావాలకు ప్రాధాన్యతనిస్తూ పట్టణ నడిబొడ్డున మల్లికార్జున సర్కిల్‌లో సోమవారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ జరగనుందని బలిజ సేవా సమితి అధ్యక్షులు బిపిఎల్ విజయ కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బలిజసేవాసమితి నాయకులు జింక వెంకట చలపతి, జంగాల శివరామ్ రాయల్, విజయభాస్కర్ వెల్లడించారు. ఆదివారం బలిజ సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విగ్రహ ప్రతిష్ట వివరాలను వెల్లడించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్ బాషా, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వివరించారు. మదనపల్లె బలిజ సేవాసమితి ఆధ్వర్యంలో జరుగనున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణకు రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి సామాజిక వర్గీయు హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

వాకింగ్ వెళుతుండగా విద్యార్థిని బైకు ఢీకొన్న సంఘటన ఆదివారం ఉదయం ములకలచెరువులో చోటుచేసుకుంది. ఘటనపై పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మొలక చెరువుకు చెందిన దాదా పీర్ డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పిటిఎం రోడ్డులో వాకింగ్ వెళుతుండగా వెనకనుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సలు అనంతరం అతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాలని డాక్టర్లు సూచించడంతో రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డివైస్ స్వామి తెలిపారు.

బి.కొత్తకోటలో మరొకరు..

పిటిఎం మండల పరిధిలోని విసనకర్రవారిపల్లెకి చెందిన ఆర్.బాలాజీ అతని సోదరులు గణేష్, నవీన్‌లు ఆదివారం బాలాజీ ఆటోలో పిటిఎం నుంచి బి.కొత్తకోటకు పెళ్లి సరుకులు తీసుకోవడానికి వస్తుండగా ఈద్గా సమీపంలోని పిటిఎం-బి.కొత్తకోట రోడ్డులో ఆటో ఎడమవైపుకు లాగడంతో డ్రైవర్ బాలాజీ సడన్ బ్రేకు వేశాడు.ఎడమవైపుకు ఆటో బోల్తా పడింది. అందులో బాలాజీ తమ్ముడికి ఎడమ కాలుకి గాయమైంది.గాయపడ్డ వ్యక్తికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలాజీ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. వీరందరూ ఒక కుటుంబానికి చెందినవారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గొల్లపల్లి పంచాయతీ ఎస్‌సి కాలనీలో కాపుర ముంటున్న పెద్దకోనప్ప కుమారుడు వెంకటరమణపై అదే గ్రామానికి చెందిన నారాయణ, వీరప్ప, మారప్ప, చిన్న రెడ్డి, రమణ, రెడ్డమ్మ, ఆర్తి, మారక్కలు మూకుమ్మడిగా రాడ్లు, కర్రలతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడని కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి ఆరు కుట్లు వేసినట్లు తెలిపారు. తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు బాధితుడు,కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.